క్లుప్తంగా

ఈరోజు

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

సింహాచలం: ఈపీడీసీఎస్ పెందుర్తి సబ్ డివి జన్‌కార్యాలయంలో మంగళవారం విద్యుత్ వినియోగదారుల సమస్య పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్టు జోన్-3 ఈఈ పి.శ్రీనివాస రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో విశ్రాంత న్యాయమూర్తి, వినియోగదారుల ఫోరం చైర్మన్ సత్యనారాయణ పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

గణపతి హోమం

సింహాచలం: ప్రియాగార్డెన్స్‌లోని స్వామి కల్యాణ మండపం వద్ద నిర్వహిస్తున్న వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం గణపతి హోమం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకుడు కర్రి సీతారామ్ ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటల నుంచి పూజలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. భక్తులంతా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ఘనంగా పండిట్ దీన్ దయాళ్ జయంతి



ఉపాధ్యాయ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గొర్లె రామునాయుడు

సింహాచలం: పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతిని పెందుర్తి బీజేపీ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గం అసెంబ్లీ కన్వీనర్ గొర్లె రామునాయుడు పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పెన్నం రమేష్, పార్వతి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సబ్బవరం: సబ్బవరం సెక్షన్-1 పరిధిలోని 33/11 కేవీ, సబ్బవరం సబ్ స్టేషన్-11 కేవీ ఫీడర్ల పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్న కారణంగా బుధవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్. రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్బవరం సబ్ స్టేషన్ పరిధిలోని సబ్బవరం,ఇరువాడ,తవ్వవానిపాలెం,అమృతపురం,అసకపల్లి గ్రామాల్లో బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కమ్యూనిస్ట్ పార్టీల ఐక్యతకు బర్దన్ కృషి



ఏబీ బర్దన్‌కు నివాళులర్పిస్తున్న జేవీ సత్యనారాయణమూర్తి తదితరులు

అల్లిపురం: దివంగత సీపీఐ జాతీయ కార్యదర్శి ఏబీ బర్దన్ శత జయంతి వేడుకలు సోమవారం ప్రారంభమయ్యాయి. అల్లిపురంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బర్దన్ చిత్ర పటానికి ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్ట్ పార్టీల ఐక్యతకు బర్దన్ విశేష కృషి చేశారన్నారు. ఈ శతజయంతి వేడుకలు ఏడాది పొడవునా నిర్వహిస్తామన్నారు. సభలు, సదస్సులు, చర్చాగోష్ఠి, తదితర కార్యక్రమాలు రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు. ఏబీ బర్దన్ కార్మిక సంఘాల బలోపేతానికి చేసిన కృషిని కొనియాడారు.

ఎస్పీ బాలుకు ఘన నివాళి

సీతంపేట: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సినీ నేపథ్య గాయకుడు, గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తృతీయ వర్ధంతి సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ బాలు తెలుగువారి సంపదని, భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన పాడిన పాటలు ఎల్లప్పుడూ మనం వింటూనే ఉంటామన్నారు.

పేదల ఆరోగ్యానికి రక్ష



దిబ్బపాలెంలో వైద్య సేవలు అందిస్తున్న సచివాలయ వైద్య సిబ్బంది



వెన్నలపాలెంలో ఇంటింట సర్వే నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

- చురుగ్గా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే
- పరవాడ మండలంలో 60 శాతం పూర్తి

పరవాడ: ప్రజల సంపూర్ణ ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాజాగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారు. దీని ద్వారా వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్నారు. అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. 'నాడు-నేడు'లో భాగంగా ప్రభుత్వాస్పత్రులను ఆధునికీకరించారు. పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించి సేవలు అందిస్తున్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా ఇళ్లకే వెళ్లి వైద్యులు సేవలు అందించి ప్రశంసలు పొందుతున్నారు. ఈ నెల 15న ప్రారంభమైన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్యులు, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుంటున్నారు. షుగర్, క్యాన్సర్, గుండె, కిడ్నీ సంబంధిత దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వ్యక్తులతో పాటు గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య వివరాలను నమోదు చేస్తున్నారు. ఉన్నతాధికారులు ఈ సర్వేను పర్యవేక్షిస్తున్నారు. చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకు అక్కడికక్కడే వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు.

60 శాతం సర్వే పూర్తి

మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే మండలంలో 60 శాతం సర్వే పూర్తి చేసినట్టు పరవాడ ఎంపీడీవో వి.హేమసుందర్రావు చెప్పారు. ఈ నెల 30 నాటికల్లా శతశాతం సర్వే పూర్తి చేస్తామని తెలిపారు. మండలంలోని 12 గ్రామ సచివాలయాల పరిధిలో 16497 ఇళ్లకు గానూ ఇప్పటి వరకు 9655 ఇళ్లలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే పూర్తి చేసినట్టు చెప్పారు. ప్రజల ఆరోగ్య పరమైన సమస్యలను తెలుసుకొని అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వైద్య పరీక్షలు పూర్తి చేసి వారికి టోకెన్లు అందజేస్తున్నారు. ఈ నెల 30 నుంచి ఆరంభం కానున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో టోకెన్ల పొందిన ప్రజలు నేరుగా వైద్య సేవలు పొందే అవకాశం ఉందని చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇళ్లకు వచ్చే వైద్య సిబ్బందికి ప్రజలు సహకరించాలని ఉచిత వైద్య సేవలు పొందాలని ఎంపీడీవో హేమసుందర్రావు కోరారు.

కాపు సంక్షేమ భవనం అప్పగించాలని వినతి



మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, ముమ్మన దేముడు తదితరులు

సింహాచలం: వేపగుంటలో ప్రభుత్వం నిర్మించిన కృష్ణదేవరాయ కాపు సంక్షేమ భవనాన్ని కృష్ణదేవరాయ కాపు సంక్షేమ సంఘానికి అప్పగించాలని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో కాపు సంక్షేమ సంఘం నేతలు సోమవారం బీసీ సంక్షేమశాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణను కోరారు. అమరావతిలో మంత్రిని కలిసి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై మంత్రి సానుకూలంగా స్పందించినట్టు కాపు సంఘం నేతలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో 95వ వార్డు కార్పొరేటర్, కృష్ణదేవరాయ కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు ముమ్మన దేముడు,ఉపాధ్యక్షుడు బల్ల రాంబాబు, ప్రధాన కార్యదర్శి నక్క కనకరాజు, సభ్యులు తామర్ల నర్సింగరావు, గొరపల్లి సర్పంచ్ గొరపల్లి శ్రీను తదితరులు ఉన్నారు.

గ్రామ సింహాల స్వైరవిహారం



వాడచీపురుపల్లి రోడ్లపై సంచరిస్తున్న వీధి కుక్కలు

పరవాడ: వాడచీపురుపల్లిలో వీధి కుక్కలు బెడద అధికంగా ఉండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. మాంసం, చేపల దుకాణాల వద్ద వ్యర్థాల కోసం సమీప గ్రామాల కుక్కలు రావడంతో వీటి సంఖ్య పెరుగుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో ఆయా దుకాణాల వద్ద ఉంటూ మిగిలిన సమయాల్లో రోడ్లు, వీధుల్లో సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. వాహనాలపై రాకపోకలు సాగిస్తున్న వారి వెంట పడుతూ పరుగులు తీయిస్తున్నాయి. వెంట పడుతున్న కుక్కలకు భయపడి వేగాన్ని పెంచుతూ వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, బజారుకు వెళ్లే మహిళలపై దాడులకు పాల్పడుతూ గాయాలపాల్జేస్తున్నాయి. చీకటి పడితే చాలు రోడ్ల మీదకు వెళ్లడానికి ప్రజలు భయపడుతున్నారు. వీధుల్లో తిష్ట వేసిన కుక్కలు రాత్రి వేళ అరుపులు కేకలతో నిద్ర లేకుండా చేస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. వీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారుల వద్ద మొర పెట్టుకున్నా ఫలితం శూన్యమని ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి వీధి కుక్కల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వినతుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

జెడ్పీ మల్లయ్యనాయుడు

సింహాచలం: జీవీఎంసీ జోన్-8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో పలువురు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జెడ్పీ మల్లయ్యనాయుడుకు వినతులు అందజేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా మల్లయ్యనాయుడు తెలిపారు. వచ్చిన వినతులను ఆయా విభాగాల అధికారులకు అందజేసి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.

- జీవీఎంసీ 98వ వార్డు సింహపురికాలనీలో పార్క్‌ను అభివృద్ధి చేయాలని కాలనీ హౌసింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి మురళీబాబు కోరారు.అలాగే కాలనీలో రోడ్ల సమస్య ఉందని పేర్కొన్నారు.
- వెంకటాపురంలోని కమ్యూనిటీహాలు అభివృద్ధి చేయాలని సీతారామ గ్రామ అభివృద్ధి సంఘం ప్రతినిధి పి.అప్పలసూరి వినతిపత్రం అందజేశారు.
- గోపాలపట్నం దరి కొత్తపాలెం సంతోష్‌నగర్ కాలనీలో కాలువలు శుభ్రం చేయాలని, పందులు, కుక్కలు సమస్య ఉందని సంతోష్‌నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఫిర్యాదు చేశారు.
- ఆర్.ఆర్.వెంకటాపురంలో వీధిలైట్(పోల్ నెంబర్ 42బైబిబై3) సమస్యను పరిష్కరించాలని వేపగుంటకు చెందిన అప్పారావు ఫిర్యాదు చేశారు.

-పాతగోపాలపట్నంలోని అప్పలనర్సయ్య కాలనీలో అక్రమ నిర్మాణం జరుగుతోందని అప్పలనర్సయ్య కాలనీకి చెందిన జి.అప్పలకొండ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు.

ఘనంగా లక్ష్మీగణపతి హోమం



హోమంలో పాల్గొన్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం వేదపాఠశాలలో సోమవారం లక్ష్మీగణపతి హోమం ఘనంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ శ్రీకాంతాచార్యులు, వేదపండితులు కాళ్లకూరి సుబ్రహ్మణ్యేశ్వరశర్మ తదితరులు హోమం నిర్వహించారు.

విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సీఐ అశోక్‌కుమార్

సింహాచలం: విద్యార్థులంతా ట్రాఫిక్ నియమాలు పాటించాలని ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్ సూచించారు. పెందుర్తి భాష్యం స్కూల్లో విద్యార్థులకు సోమవారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా రోడ్డు దాటుతున్నప్పుడు విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. స్కూల్ ఆటోల్లో పరిమితికి మించి విద్యార్థులు ఉంటే ప్రయాణించవద్దని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఏర్పాటు చేసే ఆటోల్లో ఎంతమంది విద్యార్థులు ఎక్కుతారో ముందుగా తెలుసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు కూడా ఎప్పటికప్పుడు విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్‌ఐ రమేష్ పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్న ఏకాదశి తిరువీధి



తిరువీధిలో అప్పన్నను దర్శించుకుంటున్న భక్తులు

సింహాచలం: ఏకాదశి పురస్కరించుకుని సోమవారం సాయంత్రం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి తిరువీధి విశేషంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాదస్వామి, శ్రీదేవి, భూదేవిలను విశేషంగా అలంకరించి పల్లకిలో అధిష్టంపజేశారు. సింహగిరి మాడ వీధుల్లో స్వామికి తిరువీధి నిర్వహించారు. భక్తులు తిరువీధిలో స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. దేవస్థానం ఈఈ రాంబాబు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నమో శివరుద్రాయ



ఉమాచంద్రమౌళీశ్వర స్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమా చంద్ర మౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు స్వామికి బిల్వపత్రాలతో పూజలు చేశారు. ఉమాదేవి అమ్మవారికి కుంకుమపూజలు నిర్వహించారు. పలురకాల పుష్పాలతో స్వామిని విశేషంగా అలంకరించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

ప్రణాళికాబద్ధంగానే కొలతలు

ఏసీపీ జయరామ్



బాధితులు, నిర్వాసితుల సమక్షంలో కొలతలు తీస్తున్న ఏసీపీ జయరామ్

సింహాచలం: అడవివరంలోని తొలిపావంచా నుంచి పాత అడవివరం వరకు బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణ పనులు ప్రణాళికా బద్ధంగా చేపడుతున్నామని జీవీఎంసీ జోన్-8 ఏసీపీ జయరామ్ చెప్పారు. రోడ్డు విస్తరణ నేపథ్యంలో కొలతలు తీయడంపై సోమవారం పలువురు బాధితులు, గ్రామస్తులు సందేహాలు వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న రోడ్డు మధ్య నుంచి ఇరువైపులా సమానంగా కొలతలు తీయడం లేదని, ఒకవైపు ఎక్కువ, మరొక వైపు తక్కువ చేస్తున్నారని పలువురు బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ఏసీపీ జయరామ్ బాధితుల సమక్షంలో కొలతలు తీశారు. ప్రణాళికపరంగానే రోడ్డు విస్తరణకు సంబంధించిన కొలతలు తీస్తున్నామని, గతంలో కూడా ఈవిషయం స్పష్టం చేయడం జరిగిందని తెలిపారు. కొలతల్లో ఎలాంటి పొరపాటు ఉండదని స్పష్టం చేశారు.

అమృత జయంతి ఉత్సవాలకు ఏర్పాట్లు

నేటి నుంచి దేవీపురం క్షేత్రంలో ప్రత్యేక పూజలు



దేవీపురంలోని శ్రీచక్రాలయం

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని శ్రీసహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి ఆరాధన పీఠంలో అమృత జయంతి ఉత్సవాలను మంగళవారం నుంచి నిర్వహించేందుకు శ్రీవిద్యా ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకులు కందర్ప ప్రభాకర్ తెలిపారు. అమృతానంద సరస్వతి జయంతిని పురస్కరించుకొని పలు కార్యక్రమాలకు రూపకల్పన చేసినట్లు తెలిపారు. గురూజీకి ఇష్టమైన మహిళా సాధికారత దిశగా మరోఅడుగు ముందుకువేసి కన్యా వేద గురుకులం ప్రారంభించి ముందుకు తీసుకువెళ్లాలని గురుమాత అన్నపూర్ణమ్మ నిశ్చయించారని చెప్పారు. 10 ఏళ్ల బాలికలు 10 నుంచి 15 మందిని తీసుకుని ఐదేళ్ల పాటు స్మార్త విద్య,శ్రీవిద్యలతో పాటు 4 భాషల(తెలుగు, ఇంగ్లిష్,హిందీ,సంస్కృతం)తో పాటు సైన్స్,సోషల్,మ్యాథ్స్,కంప్యూటర్ విద్య కూడా నేర్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్టు చెప్పారు. ఇది వారికి మంచి ఉపాధి అవకాశాలతో పాటు అపార జ్ఞానం,నాయకత్వ లక్షణాలు కలిగిస్తుందన్నారు.

భయపెడుతున్న గోతులు!



పైడిమాంబ ఆలయం ఎదురుగా గుంతలమయంగా రోడ్డు

పరవాడ: గాజువాక-యలమంచిలి రహదారిలో పలు చోట్ల ఏర్పడిన గుంతలు ప్రయాణికులను భయపెడుతున్నాయి. పరవాడ సినిమాహాలు కూడలికి సమీపంలోని పైడిమాంబ ఆలయం ఎదురుగా భారీ గోతులు పడ్డాయి. ఏ మాత్రం వర్షం కురిసినా అవి నీటితో నిండిపోతున్నాయి. ఆ సమయంలో రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులకు గుంతలు ఎక్కడున్నాయో తెలియక ప్రమాదాల బారిన పడుతున్నారు. ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాల బారిన పడగా.. వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. ఇదే రహదారిలో ఊటగెడ్డ కూడలి వద్ద ఏర్పడిన అతి పెద్ద గుంత ప్రయాణికులను నిత్యం భయపెడుతోంది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో ఏర్పడిన గుంతలు పూడ్చడానికి ఆర్అండ్‌బీ అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు కోరుతున్నారు.

గణపతికి విశేషంగా గరిక పూజ



గరిక పూజలో పాల్గొన్న వర్తక సంఘం వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు

సింహాచలం: సింహగిరి వర్తక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామికి గరిక పూజ విశేషంగా జరిగింది. వర్తక సంఘం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ పూజ నిర్వహించారు. దాదాపు వందమంది వర్కర్లు అంతా కలిసి స్వామికి గరిక పూజ చేసి హారతులు అందజేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. వర్తక సంఘం ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బంటుబల్లి సురేష్, వర్తక సంఘం వర్కర్సు యూనియన్ అధ్యక్షుడు దాసరి పైడిరాజు, ఉపాధ్యక్షుడు అడప గణేష్, కార్యదర్శి నేతేటి నరసింహమూర్తి, సభ్యులు మణికంఠ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నిర్మూలన అందరి బాధ్యత

- మేయర్ గొలగాని హరివెంకటకుమారి
- ఆర్టీసీ బస్సులో కార్యాలయానికి పయనం



జీవీఎంసీకి వెళ్లడానికి ఆర్టీసీ బస్సు కోసం బస్టాప్‌లో వేచి ఉన్న మేయర్ హరివెంకటకుమారి

డాబాగార్డెన్స్: కాలుష్య నియంత్రణ మన సామాజిక బాధ్యత అని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా మేయర్ సోమవారం తన సొంత వాహనం వదిలి క్యాంపు కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్సులో ప్రయాణించి జీవీఎంసీకి చేరుకున్నారు. అనంతరం డయల్ యువర్ మేయర్ కార్యక్రమంలో పాల్గొని ప్రజా సమస్యలు విన్నారు. ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో మేయర్ పాల్గొని అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలో వాయు, శబ్ద కాలుష్యం పెరిగిపోయిందని, వాటి నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. నగరంలో ప్రైవేట్, ప్రభుత్వ సంస్థల యాజమాన్యాలు తమ ఉద్యోగులను వారంలో ఒక్క రోజు ప్రజా రవాణాను ఉపయోగించేలా సూచించాలన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా సాధ్యమైనంత వరకు విద్యుత్ వాహనాలు ఉపయోగించాలన్నారు.

శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు



అమ్మవారికి పారామాత్మిక హోమం నిర్వహిస్తున్న వేదపండితులు



పవిత్రోత్సవాల్లో విశేష కార్యక్రమాలు నిర్వహిస్తున్న వేదపండితులు

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి ఆలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు సోమవారం రెండో రోజుకు చేరాయి. పవిత్రోత్సవాల్లో భాగంగా అమ్మవారికి పూజాదికాలు నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి విష్వక్సేన, పుణ్యాహవచన, పంచవ్యారాధన, పంచాగవ్యాప్రాశన, అగ్ని మథనం, అగ్ని ప్రతిష్ఠాపన, ప్రధాన హోమాలు జరిపారు. సాయంత్రం 6 గంటల నుంచి అగ్నిధ్యానం, ప్రధాన హోమాలు, పంచకుంభ ఆరాధన, పవిత్ర అభిమంత్రణ, పారామాత్మిక హోమం, చతుర్వేద పారాయణం తదితర పూజల చేశారు

నేడు అంతరాలయ దర్శనాలు రద్దు

పవిత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 9 నుంచి బుధవారం ఉదయం 11 గంటల వరకు అంతరాలయ దర్శనాలు నిలిపివేయనున్నట్టు ఆలయ ఈవో కె.శిరీష తెలిపారు. ఆ సమయంలో నిర్వహించే పంచామృతాభిషేకం నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, సభ్యులు సత్యరూపవాణి, వి.మారుతీప్రసాద్, సుబ్రహ్మణ్యం, సహాయ ఈవో కె.రాజేంద్రకుమార్, పండితులు, అర్చకులు పాల్గొన్నారు.